www.ninadam.in
# నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం ఏప్రిల్ 28 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల




**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):** తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయింది. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది. దీంతో పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు చేసింది.

# దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి

**చర్లపల్లి రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ల మౌలిక సదుపాయాలపై లేఖ**

**గతంలోను ముఖ్యమంత్రికి లేఖ రాశానన్న కిషన్ రెడ్డి**

**అయినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్న కేంద్రమంత్రి**

**రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ**

**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):** చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మౌలిక సదుపాయాలకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ పనుల నిమిత్తం గతంలో పలుమార్లు లేఖలు రాసినా అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. "దయచేసి ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆయా రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి" అని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, ప్రయాణికుల రాకపోకల మూలంగా నగరంలోని మూడు ప్రధాన రైల్వే స్టేషన్లు సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్





టెర్మినళ్లపై అధిక భారం పడుతోందని గుర్తు చేశారు. 02

# సిక్కిం ఆవిర్భావ దినోత్సవం



## పిల్లలతో కలసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(నినాదం ):** నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉ 02



## ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తే చర్యలు తప్పవు

- **పహల్గామ్ ఉగ్రదాడి యావత్ మానవాళిని కుదిపేసిందని వ్యాఖ్య**
- **ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామన్న రాజ్‌నాథ్ సింగ్**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(నినాదం ):** ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వెనుకాడకూడదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలను ఎదుర్కోక తప్పదని 02



## 42శాతంతో జడ్పీటీసి, ఎంపిటిసి ఎన్నికలు

- **రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సోమవారం లేఖ రాశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల 02

## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్

- **ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న శివధర్ రెడ్డి**
- **సీవీ ఆనంద్‌ను డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**
- **హైదరాబాద్ సీపీగా పనిచేసిన సీవీ ఆనంద్**

**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఈ నెల 30వ తేదీతో ఉద్యోగ విరమణ పొందనున్న నేపథ్యంలో, సీవీ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ డీజీపీగా అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను ఇటీవలే యూపీఎస్సీ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం డీజీపీగా నియమించింది. సీవీ ఆనంద్ 1991 బ్యాచ్‌కు చెందిన అధికారి. ఆయన హైదరాబాద్ సీపీగా, ఏసీపీ డీజీగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఇకపై ఆయన రాష్ట్ర పోలీస్ బాస్ గా నూతన బాధ్యతలు చేపడతారు.



## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

- **అలాంటి పోలీస్ అధికారులను వదలం**
- **మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక**

**సంగారెడ్డి, ఏప్రిల్ 27(నినాదం ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత



మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని 02



## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

అనవసర భయాందోళనలకు గురి కావద్దు,

అపౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర 02




# గూగుల్ .. ఎపికి గేమ్ ఛేంజర్

**గ్రోత్ ఇంజిన్‌గా మారనున్న గూగుల్, 2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి**

**దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది**

**ఎంఓయూలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం**

**గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు**



గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, గూగుల్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్.. ఏపీ టెక్నాలజీతోపాటు దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందన్నారు. టెక్నాలజీ హబ్‌కు భవిష్యత్‌లో తుర్లవాడ పేరు మార్మోగుతుందన్నారు. టెక్నాలజీలో ఏపీ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతుంది. కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది. ఏఐ డేటా సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యంతో పని చేస్తుంది. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోంది. ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులకు రావడం శుభపరిణామం. గూగుల్ ఆవిష్కరణలు.. ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రెండూ కలుస్తున్నాయి. ఓడరేవుల వంటి రంగాల్లో పని చేస్తున్న ప్రతిష్ఠాత్మక 02

### ఎఐ యుగంలో గూగుల్ డేటా సెంటర్ కీలకం

- **గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఆంధ్రప్రదేశ్ పరుగులు**
- **గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే**





## గూగుల్‌తో మారనున్న విశాఖ ముఖచిత్రం

**సరికొత్త చరిత్రకు నాంది పలికాం**

**గూగుల్ సెటంర్ కార్యక్రమంలో లోకేశ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 27(నినాదం ):** గూగుల్ రాక.. విశాఖకే కాదు.. ఏపీకి ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ చరిత్రలో మరచిపోలేని రోజు ఇదన్నారు. భారతదేశానికి ఏపీ..అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుంది. విశాఖలోని తర్లువాడలో

## అమరావతి – హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

**70 నిముషాల్లోనే ప్రయాణం**

- **చంద్రబాబు విజినరీ లీడర్**
- **కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 27(నినాదం ):** చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి – హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల 08 నిమిషాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు. చెన్నై నుంచి కోల్‌కతా మధ్య రైల్వే లైన్లను 4 లేన్లుగా విస్తరించే




పనులు చేపడతామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు 02

## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

**పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు**

**ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు**

**హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):** బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ 02



EVENING 6 PM 02
# నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
డిజిటల్ ఎడిషన్
మంగళవారం ఏప్రిల్ 28 2026
ninadam.in

# గూగుల్ .. ఏపికి గేమ్ ఛేంజర్

సంస్థ అదానీ.. ప్రజలకు కమ్యూనికేషన్‌తో అనుసంధానం చేస్తున్న మరో సంస్థ ఎయిర్‌టెల్.. ఈ మూడు సంస్థలు ఎప్పుడూ నూతన ఆలోచనలు చేస్తుంటాయన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి కావాలి. రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు సహకరిస్తాం. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తాం. భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా మారుతుంది. వ్యాపార నిర్వహణ ఖర్చు.. మిగిలిన నగరాలకంటే చాలా తక్కువగా ఉంటుంది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంవోయూలకే పరిమితం కాదు.. ముందుకు ఎలా తీసుకెళ్లాలో చూపిస్తున్నాం. పెట్టుబడులు, ఒప్పందాలే కాదు.. ప్రారంభంలోనూ ముందున్నాం అని చంద్రబాబు అన్నారు. అలాగే విశాఖకు గూగుల్ రాక ఉత్తరాంధ్రకే గర్వకారణమని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటవుతోందని తెలిపారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం ఏపీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. గూగుల్, ఎయిర్‌టెల్ రెండూ కీలక సంస్థలని వెల్లడించారు. సెప్టెంబర్ 2028 నాటికి గూగుల్ డేటా సెంటర్ పూర్తవుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో అన్నిరంగాల్లో ఏఐ సేవలు వస్తాయని వివరించారు. 60 రోజుల్లో అనకాపల్లి, విశాఖపట్నానికి గోదావరి నీళ్లు వస్తాయని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని తెలిపారు. 2028 చివరినాటికి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలిదశ పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ సిటీగా విశాఖ ఉంటుందని.. తెలిపారు. టెక్నాలజీలో దేశానికే గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ ఉందని వెల్లడించారు. పెట్టుబడిదారులే ఏపీకి భాగస్వాములని చెప్పారు. ఒప్పందాలే కాదని.. గ్రౌండింగ్ కూడా తమదే బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## గూగుల్ తో మారనున్న విశాఖ ముఖచిత్రం

**- లోకేశ్**

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో ప్రయోజనాలు చూపిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తర్లువాడలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ డేటా సెంటర్‌కు తర్లువాడ, రాంబిల్లి, అడవివరంలో 600 ఎకరాలను ఏపీ సర్కార్ కేటాయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ అంటే గూగుల్ అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒకలెక్క.. ఇక నుంచి మరో లెక్క అని చెప్పుకొచ్చారు. ఇవాల్టి నుంచి విశాఖ ముఖచిత్రం మారబోతోందని తెలిపారు. సరికొత్త చరిత్రకు ఇవాళ పునాదిగా మారిందని వెల్లడించారు. ఇకపై డేటా ఏఐ హబ్‌గా విశాఖపట్నం మారుతోందని వివరించారు. పెట్టుబడులతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లు ఏపీలో విధ్వంస పాలన చూశామని విమర్శించారు. గూగుల్ ప్రాజెక్టు తెచ్చిందెవరని గూగుల్‌ని అడిగితే చంద్రబాబు పేరే చెబుతోందని అన్నారు. వైసీపీ పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని ఆరోపించారు. తమది గూగుల్.. వైసీపీది గొడ్డలి.. బోత్ ఆర్ నాట్ సేమ్ అని చెప్పుకొచ్చారు. నమో అంటే నాయుడు.. మోదీ అని మంత్రి లోకేశ్ అభివర్ణించారు.

## ఏఐ యుగంలో గూగుల్ డేటా సెంటర్ కీలకం

**- బికాస్ కోలే**

ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమి పూజ చేశారు. వన్ గిగా వాట్ సామర్థ్యంతో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో మెగా డేటా సెంటర్‌ను గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. డేటా సెంటర్‌కు తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో మొత్తం 600 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అన్ని రకాల అనుమతులను సర్కార్ క్లియర్ చేసింది. ఈ సందర్భంగా గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే మాట్లాడుతూ... గూగుల్ ఇండియా ఏఐ హబ్‌కు ఇవాళ చేసిన శంకుస్థాపన 2047 వికసిత్ భారత్‌కు ఓ పునాదిరాయి లాంటిదన్నారు. ఏఐ యుగంలో విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లోనూ ఈ డేటా సెంటర్ అత్యంత ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఇప్పుడు విశాఖ, ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని అన్నారు. ఇంటర్నేషనల్ సబ్ సీ గేట్ వేగా ఉన్న ముంబై, చెన్నైలతో పాటు విశాఖ కూడా కీలకంగా మారిందని వెల్లడించారు.

కొత్త ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఇతర ప్రాంతాలతో విశాఖను అనుసంధానం చేస్తాయని బికాస్ కోలే తెలిపారు. సముద్ర గర్భ లైన్లతో సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇక డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయన్నారు. అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ట్రాలు ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న ఈ ప్రాంతానికి టెక్ ఫ్యూచర్‌ను అందించేలా ఈ డేటా సెంటర్ ఉంటుందని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత, ఇంధన భద్రత, నీటి వినియోగం లాంటి అంశాలతో స్థానిక భాగస్వామ్యంతో ముందుకు అడుగులు వేస్తామన్నారు. యువతకు భవితను అందించేలా వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐలో శిక్షణ కార్యక్రమాలను గూగుల్ నిర్వహిస్తుందని తెలిపారు. 10 వేల మందికిపైగా మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌గా మారేందుకు సహకారం అందిస్తుందని అన్నారు. న్యూ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్ లాంటివి ఈ ప్రాంతానికి ఇంధన భద్రతను కల్పిస్తాయన్నారు. విశాఖలోని వివిధ నివాస ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్ నిర్మితం అవుతుందని బికాస్ కోలే వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, బాల వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన మావోలకు పునరావాసం

**- పర్యాటక శాఖలో గిరిదర్శక్ గైడ్లుగా శిక్షణ**



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నినాదం) :** రాష్ట్రంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా కర్రెగుట్టలు, భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావో యిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావో యిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తా మని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించాయి. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాల ఎదుట భారీగా మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణ ప్రభుత్వం.. వారిని గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

## మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారు.. రిటైరైనా వదిలిపెట్టం



**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నినాదం) :** ఐపీఎస్ అధికారులకు హరీశ్ రావు వార్నింగ్ బీఆర్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఎమ్మెల్యేల ఫోన్లను, వారి ఇళ్ల ముందున్న సీసీ కెమెరాలను ప్రైవేట్ హ్యాకర్ల ద్వారా కొందరు ఐపీఎస్ అధికారులు హ్యాక్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కొందరు ఐపీఎస్ అధికారులు బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను రప్పించి తమ వ్యక్తిగత సంభాషణలు, సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్నారని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు రిటైర్ అయినా వదిలిపెట్టమని, రాబోయేది తమ ప్రభుత్వమేనని హెచ్చరించారు. బాధ్యులైన వారు సొంత ఖర్చులతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌తో పాటు ఇతర నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ వేధిస్తోందని ధ్వజమెత్తారు. బెయిల్ వచ్చే సమయంలో పీటీ వారెంట్లు తెచ్చి మరీ జైల్లో ఉంచుతున్నారని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ మోసం చేసిందని, ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగ్గొట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

# తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం



**హైదరాబాద్ ఏప్రిల్ 28 (నినాదం) :** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. ఎయిర్ కండీషనర్లు, డిజర్ట్ కూలర్లు అధికంగా వాడడం వల్ల విద్యుత్తు వినియోగం కూడా పీక్ స్థాయికి చేరుకున్నది. విద్యుత్తు శాఖ డేటా ప్రకారం సోమవారం సుమారు 256 గిగా వాట్ల విద్యుత్తు వినియోగం జరిగినట్లు తెలిసింది. ఈనెలలో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఈ నెల రెండో అర్థభాగం నుంచి విద్యుత్తు మోత మోగుతున్నది. శుక్రవారం రోజు 252.07 గిగావాట్లు, శనివారం ఏప్రిల్ 25వ తేదీన 256.11 గిగావాట్ల వినియోగం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. అయితే గత ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గింది. ఆదివారం 238.15 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. కమర్షియల్, ఇండస్ట్రియల్ కంపెనీలు ఎక్కువగా సెలువు తీసుకోవడం వల్ల ఆదివారం విద్యుత్తు వినియోగం తగ్గినట్లు అంచనా వేశారు. దీంతో పాటు కొన్ని చోట్లు డస్ట్ స్టార్మ్, వర్షాలు పడడం వల్ల ఆదివారం వినియోగం తగ్గింది. గత ఏడాది అత్యధికంగా విద్యుత్తు వినియోగం జూన్‌లో రికార్డు అయ్యింది. 2025 జూన్‌లో ఓ రోజు గరిష్టంగా సుమారు 242.77 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. 2024లో గరిష్టంగా 250గిగావాట్ల విద్యుత్తును మే నెలలో వాడారు. ఇక 2023లో సెప్టెంబర్‌లో సుమారు 243.27 గిగావాట్ల విద్యుత్తును వినియోగించారు. ఈ ఏడాది వేసవిలో ఎండలు మండనున్నట్లు ఐఎండీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది గరిష్టంగా 270 గిగావాట్ల విద్యుత్తు వినియోగం జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ నిపుణులు చెబుతున్నారు.

# ఇలాగైతే విమానాలను నడపలేం

- విమాన ఇంధన ధరలను అదుపు చేయండి
- వెంటనే కేంద్రం జోక్యం చేసుకోవాలి
- కేంద్ర విమానయాన శాఖకు ఎఫ్ఐఏ లేఖ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (నినాదం) :** విమాన ఇంధన ధరల పెరుగుదలపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఎఫ్ఐఏ ఆందోళన వ్యక్తం చేసింది. విమాన ఇంధన ధరల్ని అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు కేంద్ర విమానయాన శాఖకు మంగళవారం లేఖ రాసింది. కేంద్రం జోక్యం చేసుకుని విమాన ఇంధన ధరలు తగ్గించకుంటే విమానయానాన్ని కొంతకాలం మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్ఐఏ సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ వంటి సంస్థలకు ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. తాజాగా ఆయా సంస్థల తరఫున కేంద్రానికి లేఖ రాసింది. ఎఫ్ఐఏ ప్రకారం.. ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాల వల్ల విమాన ఇంధన ధరలు (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్/ఏటీఎఫ్ ) భారీగా పెరిగాయి. దీంతో విమానయాన సంస్థలపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల విమానాల నిర్వహణ కష్టమైపోతోంది. ఏటీఎఫ్ ధరలు చమురు సంస్థలకు అందుబాటులో లేకుండా పెరిగాయి. ఒక కిలోలీటర్ చమురుకు దాదాపు రూ.2 లక్షల వరకు ఖర్చవుతోంది. పశ్చిమాసియాలో క్రూడాయిల్ ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది.

సాధారణంగా ఎయిర్ లైన్స్ సంస్థల వ్యయంలో 30,40 శాతం ఇంధనానికి ఖర్చవుతుంది. కానీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల పెరుగుదలవల్ల ఈ ఖర్చు 55,60 శాతం పెరిగింది. అందుకే కేంద్రం త్వరగా జోక్యం చేసుకుని ధరలు తగ్గించాలని ఎఫ్ఐఏ కేంద్రాన్ని కోరుతోంది. ఏటీఎఫ్ పై ప్రస్తుతం విధిస్తున్న 11 శాతం పన్నును తగ్గించాలని, అలాగే, రాష్ట్రాలు విధించే వ్యాట్ కూడా తొలగించాలనిల కేంద్రాన్ని కోరుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25 శాతం వరకు వ్యాట్ ఉన్న సంగతిని ఎఫ్ఐఏ ప్రస్తావిస్తోంది. అలాగే, ఇంధన ధరల్లో స్థిరత్వం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. ధరల స్థిరీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఉండాలని ఎఫ్ఐఏ కోరుతోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల అనేక మార్గాల్లో విమానాలు నడపడం ఆయా సంస్థలకు భారంగా మారుతోంది. అంతేకాదు.. కొన్ని రూట్లలో విమాన సర్వీసుల్ని తగ్గించడం, రద్దు చేయడం చేస్తున్నాయి. ఫ్యుయల్ ధరలు పెరిగితే, అంతిమంగా విమాన టిక్కెట్ల ధరలు పెరుగుతాయి.

## అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

సైబరాబాద్ నిర్మించారని.. ఐటీ అభివృద్ధిలో సైబర్ టవర్‌ది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు విజన్‌కు సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. ఆయనను దేశం గర్వించే విజనరీ లీడర్‌గా కేంద్రమంత్రి అభివర్ణించారు. యువనేత లోకేశ్ ఎనర్జీ, నాయకత్వం అద్భుతమని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో యువనేతలకు లోకేశ్ ఆదర్శమని పేర్కొన్నారు. తయారీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. 2024 నుంచి సెమీకండక్టర్ల తయారీపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖపట్నానికి రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 1 నుంచి విశాఖపట్నం రైల్వే జోన్‌ను నోట్గి÷ చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

## సిక్కిం ఆవిర్భావ దినోత్సవం



దయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

## దయచేసి వ్యక్తిగతంగా చొరవ తీసుకోండి

ఈ సమస్యకు పరిష్కారంగానే చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద రూ.430 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్‌ను కేంద్రం అభివృద్ధి చేసిందని అన్నారు. గత సంవత్సరం ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ టెర్మినల్ నుంచి పదుల సంఖ్యలో రైళ్లు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రోజురోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నందున రైల్వే స్టేషన్‌కు వెలుపల అప్రోచ్ రోడ్లను విస్తరించాల్సి ఉందని అన్నారు. స్టేషన్‌కు ఇరువైపులా పార్కింగ్ తదితర అవసరాల కోసం కూడా భూసేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. చర్లపల్లి స్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్‌కు 200 అడుగుల వెడల్పుతో, భరత్ నగర్, ఈసీ నగర్‌ల వైపు 100 అడుగుల చొప్పున వెడల్పుతో రోడ్లను విస్తరించాలని కోరారు. చర్లపల్లి టెర్మినల్‌కు నీటి సరఫరా కనెక్షన్‌ను ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ రూ.4 కోట్లు జమ చేసిందని, ఈ నీటి కనెక్షన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్తు రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ స్టేషన్ వద్ద ఆల్ఫా హోటల్ నుంచి రేతిఫైల్ బస్ స్టేషన్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరించాల్సి ఉందని అన్నారు. ఈ అభివృద్ధి పనుల కోసం రైల్వే శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదించామని అన్నారు. ఈ పెండింగ్ పనులకు సంబంధించి 2022, 2023 సంవత్సరాలలో నాటి ముఖ్యమంత్రికి రెండుసార్లు లేఖలు రాశానని గుర్తు చేశారు. 2024లో మీకు కూడా లేఖ రాశానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అయినా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని అన్నారు. తాను ఉత్తరం రాసిన తర్వాత మీరు పనులు ప్రారంభించాలని ఆదేశించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ పనులను పూర్తి చేయాలని తన లేఖలో కిషన్ రెడ్డి కోరారు.

## 42శాతంతో జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు ప్రయత్నించినప్పటికీ పంచాయతీ ఎన్నికలలో 53శాతం, మున్సిపల్‌లో 68 శాతం బీసీలు గెలిచి సత్తా చాటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై కోర్టులో ఉన్న స్టేను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను ఆయన కోరారు

## ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తే చర్యలు తప్పవు

హెచ్చరించారు. కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత సంవత్సరం జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి యావత్ మానవాళిని కుదిపేసిందని అన్నారు. ఆ తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి, ఉగ్రవాదులు ఎక్కడున్నా తప్పించుకోలేరని నిరూపించిందని అన్నారు. ఉగ్రవాదం ప్రపంచానికి ప్రధాన సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ మద్దతుతో జరిగి సీమాంతర ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదని ఈ సందర్భంగా కోరారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులకు సాయపడుతూ, ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో షాంఘై సహకార సంస్థ ముందుండాలని కోరారు. గత కొన్నేళ్లుగా జరుగుతున్న వరుస ఘర్షణల కారణంగా ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఇటీవలి యుద్ధాలను ఉద్దేశించి అన్నారు.

## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని మాజీ మంత్రి హరీశ్ రావు నిలదీశారు.

## రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (నినాదం) :**

రాష్ట్రనీలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 27 వ తేదీన డిమాండ్ ను మించి పెట్రోల్ , డీజిల్ లను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్ కు డిమాండ్ ఉండేదని ఆయన తెలిపారు. కానీ 27 వ తేదీన 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్ ను వాహనదారులకు సరఫరా చేసినట్లు తెలిపారు. సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అపోహలతో పెట్రోల్, డీజిల్ ను నిల్వచేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ సూచించారు.

## వివాదంలో అషురెడ్డి వ్యవహారం

క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం ఏప్రిల్ 28 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్


# ప్రైవేటు ఆసుపత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవ బకాయిల చెల్లింపు షురూ

- ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ఆసుపత్రులకు బకాయిల చెల్లింపు ప్రారంభం
- 'బిల్ డిస్కౌంటింగ్' విధానంలో రూ.1000 కోట్లు విడుదల
- ఇప్పటికే 25 ఆసుపత్రులకు రూ. 62 కోట్ల చెల్లింపు పూర్తి
- కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించిన మొత్తం రూ.5,556 కోట్లు



**అమరావతి, ఏప్రిల్ 28 (నినాదం) :**
ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులకు పేరుకుపోయిన బకాయిల చెల్లింపు ప్రక్రియను ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. 'ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ అగ్రిమెంట్' (టీబీడీఏ) విధానంలో సుమారు రూ. 1,000 కోట్లను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 25 ఆసుపత్రులకు రూ. 62 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు, ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ పోర్టల్ ద్వారా ఈ చెల్లింపులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 323 ఆసుపత్రులు ఈ విధానం కింద దరఖాస్తు చేసుకున్నాయి. బకాయిల చెల్లింపు పురోగతిపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈఓ చక్రధర్ బాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు. ప్రస్తుతం 873 ప్రైవేటు ఆసుపత్రులకు కూటమి ప్రభుత్వం రూ. 2,044 కోట్లు బకాయి పడింది. ఇందులో భాగంగా తొలి విడతగా రూ. 1,000 కోట్ల బిల్లుల పరిశీలన పూర్తి చేసి, చెల్లింపులు జరుపుతోంది. ఈ విధానంలో, ప్రభుత్వం తరపున ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీపీఎఫ్‌సీ) నిధులు చెల్లిస్తుంది. ఆసుపత్రులకు చెల్లించాల్సిన మొత్తంలో వార్షిక వడ్డీని ముందుగానే మినహాయించి, మిగిలిన మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ట్రస్టు అనుబంధ ఆసుపత్రులకు మొత్తం రూ. 5,556 కోట్లు చెల్లించింది. గత వైకాపా ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 2,403 కోట్ల బకాయిలను కూడా ఇందులో భాగంగానే చెల్లించడం గమనార్హం. తాజా చెల్లింపులతో కలిపి ఆసుపత్రులకు మరింత ఊరట లభించనుంది.

# కేసీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన మల్లు రవి

- కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కావడం వల్ల బయటి విషయాలపై అవగాహన తగ్గుతోందన్న మల్లు రవి
- కాంగ్రెస్ నేతలపై బురదజల్లడం కేసీఆర్ మానుకోవాలని హితవు

**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎంపీ మల్లు రవి కౌంటర్ ఇచ్చారు. పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా కేసీఆర్ మాట్లాడటం సరికాదని మల్లు రవి హితవు పలికారు. కేసీఆర్ ఎక్కువగా ఫాంహౌస్‌కే పరిమితం కావడం వల్ల బయటి విషయాలపై ఆయనకు అవగాహన తగ్గుతోందని విమర్శించారు. ముఖ్యంగా లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును అవమానిస్తూ మాట్లాడినప్పుడు కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఉన్నారన్న కేసీఆర్ ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేసిన వెంటనే తాము పార్లమెంటులోనే నిరసన తెలిపామని, ఆయన క్షమాపణ చెప్పాలని గట్టిగా డిమాండ్ చేశామని మల్లు రవి గుర్తు చేశారు. అసలు విషయం తెలుసుకోకుండా కాంగ్రెస్ నేతలపై బురదజల్లడం కేసీఆర్ మానుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవిస్తుందని, కానీ కేసీఆర్ మాత్రం తన రాజకీయ ఉనికి కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.



# లారీని ఢీకొన్న స్లీపర్ బస్సు

**- ముగ్గురు వ్యక్తులకు గాయాలు**

**విశాఖపట్టణం, ఏప్రిల్ 27(నినాదం ):**
ఎస్ రాయవరం మండలం అడ్డురోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీని ప్రైవేట్ స్లీపర్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు అడ్డురోడ్డు వద్దకు చేరుకున్న సమయంలో వంతెనపై నిలిచి ఉన్న లారీని, బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ఒక పక్క పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రమేష్ తెలిపారు.

# 'సారు బయటకు రారు' అని కవితనే చెప్పారు

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
"సారు బయటకు రారు, ఎవరినీ కలవరు" అని స్వయంగా కేసీఆర్ కూతురు, తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తన తండ్రిపై విమర్శలు చేశారని, ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిలదీశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఏ రైతునూ కలవని కేసీఆర్, వారు ఇబ్బందుల్లో ఉన్నట్లు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తరుగు పేరుతో రైతులను దోపిడీ చేశారని ఆరోపించారు. తెలంగాణలోని రైతులను పట్టించుకోని కేసీఆర్, ఇతర రాష్ట్రాలకు వెళ్లి చెక్కులు ఇచ్చారని కవిత చెప్పారని, ఆమె వ్యాఖ్యలకు సమాధానం చెప్పని కేసీఆర్, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించడమేమిటని అన్నారు. రైతుల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం సంవత్సరానికి రూ. 2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. వరిసాగులో తెలంగాణ ఇప్పుడు పంజాబ్‌ను అధిగమించిందని, ఈ సీజన్‌లో కూడా 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధాన్యానికి బోనస్ రూ. 3 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేసినట్లు చెప్పారు. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రైతుబంధును అమలు చేసి అన్ని పథకాలను నిలిపివేశారని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో ఆలోచించడం లేదని విమర్శించారు. ఆ పార్టీ నేతల అహంకార ధోరణిని ప్రజలు తప్పుపడుతున్నారని వ్యాఖ్యానించారు.

# జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్‌కు సరఫరా..

- ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..
- వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..
- జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా.. - జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

**విజయవాడ, ఏప్రిల్ 27(నినాదం ):**
జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లేకుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లా లో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ బంకులను ఎనికెపాడులోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఓసిఎల్ బంకులలో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుడుందనే అపోహలతో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరిగిందన్నారు.




ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవసరం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటలలోపే ట్యాంకర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా నియంత్రణలో ఉందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంధన సరఫరాపై ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వినియోగదారులకు ఇబ్బంది తలెత్తిన పక్షంలో 9154970454 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. ఆయిల్ బంకుల పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ వెంట విజయవాడ రూరల్ తహాశీల్ధార్ బి. సుగుణ, రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పూడి శ్రీహరికి సుప్రీంలో చుక్కెదురు

- ముందస్తు బెయిల్ నిరాకరించిన కోర్టు







**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(నినాదం ):**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోల మార్ఫింగ్ కేసులో మాజీ సీఎం జగన్ సీపీఆర్‌వోగా పని చేసిన పూడి శ్రీహరికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు, మధ్యంతర ఉపశమనం కలిగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ కేసులో పూడి శ్రీహరిని రిమాండ్‌కు అప్పగించాలంటూ గతంలో పోలీసులు కుప్పం ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. దీంతో పోలీసులు హైకోర్టును ఆశ్రయించగా.. కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ.. విచారణకు సహకరించాలని పూడి శ్రీహరిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

# కేంద్రమంత్రులతో కలిసి సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న సీఎం చంద్రబాబు

**- ఆలయ సంప్రదాయం ప్రకారం కప్ప స్తంభానికి మొక్కులు**



**విశాఖపట్నం, ఏప్రిల్ 27(నినాదం ):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి, ప్రసిద్ధి చెందిన కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని మొక్కులు చెల్లించారు. దర్శనం ముగిసిన తర్వాత, దేవస్థానం పండితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, గణబాబు తదితరులు కూడా స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. వీరి రాకతో సింహాచలం ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది.



# యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న నారా భువనేశ్వరి

**- కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రికి వెళ్లిన భువనేశ్వరి**

**యాదాద్రి ఏప్రిల్ 28 (నినాదం) :**
తెలంగాణలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదాద్రిని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయానికి చేరుకున్న భువనేశ్వరికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నారా భువనేశ్వరి గర్భాలయంలోని స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్శనం అనంతరం రంగమండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేయగా, అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని బహూకరించారు. మరోవైపు, వేసవి సెలవుల దృష్ట్యా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, ఆమె పర్యటన సమయంలో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

# పెట్రోల్, డీజిల్ కొరతపై నిరసనలకు పిలుపునిచ్చిన వైసీపీ

- రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు చేపట్టిన వైసీపీ
- పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టించారన్న జగన్
- ఏ సమస్య వచ్చినా దాన్ని క్యాష్ చేసుకోవడం చంద్రబాబుకు అలవాటని విమర్శ



**అమరావతి, ఏప్రిల్ 28 (నినాదం) :**
రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై వైసీపీ నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. రాష్ట్రంలో కృత్రిమ కొరత సృష్టించారని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద శాంతియుత నిరసనలు చేపట్టనున్నట్టు పార్టీ నాయకత్వం తెలిపింది. ఈ క్రమంలో, పలుచోట్ల వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. మరోవైపు, 'ఎక్స్' వేదికగా స్పందించిన వైసీపీ అధినేత జగన్... ఇంధన సంక్షోభాన్ని 'ప్రభుత్వ ప్రేరేపిత కృత్రిమ కొరత'గా అభివర్ణించారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలో లేని కొరత ఏపీలోనే ఎందుకుందని జగన్ ప్రశ్నించారు. డీలర్లు, కూటమి నేతలు కుమ్మక్కై నిల్వలు దాచిపెట్టి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు ఏ సమస్య వచ్చినా దానిని క్యాష్ చేసుకోవడం అలవాటని, గతంలో ఎరువులు, విత్తనాల విషయంలో జరిగినట్లే ఇప్పుడు ఇంధనం విషయంలోనూ జరుగుతోందని మండిపడ్డారు. రబీ కోతల సమయంలో యంత్రాలకు డీజిల్ అందక రైతులు, ఏరియేటర్లు నడవక ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే సాకుతో డీలర్లు స్టాక్ దాచిపెడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# తెలుగుగంగ ద్వారా కృష్ణాజలాలు నిలిపివేత



**చిత్తూరు, ఏప్రిల్ 27(నినాదం ):**
తెలుగు గంగ ప్రాజెక్టు కింద చెన్నైకి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలోని కృష్ణానది నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఏపీ సరిహద్దు ప్రాంతమైన కండలేరులో నిల్వవుంచుతారు. అక్కడి నుండి తెలుగుగంగ కాలువ ద్వారా తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ప్రస్తుతం కండలేరు-పూండి మధ్య తెలుగుగంగ ప్రాజెక్టులో ఏపీ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల కారణంగా కృష్ణాజలాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఈ నెలాఖరుకు పూర్తిచేశాక మే 1వ తేదీ నుంచి యథావిధిగా కృష్ణాజలాలను సరఫరా చేయనున్నట్లు ఏపీ అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ తెలిపింది. ఇదిలాఉండగా, నగరవాసులదాహార్తిని తీరుస్తున్న పూండి, చెంబరంబాక్కం, పుళల్, షోళవరం, కన్నన్‌కోట, తేర్వైకండిగై రిజర్వాయర్లలో ప్రస్తుతం 7,966 మిలియన్ ఘనపుటడుగుల నీటిని నిల్వవుంచినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు నిల్వవుంచిన నీటిమట్టం కంటే 36 మిలియన్ ఘనపుటడుగులు తక్కువని, ఈ వేసవి సీజన్‌లో తాగునీటి కొరత ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఎందుకొచ్చింది?

- ఇంధన సంక్షోభంపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్ షర్మిల
- రూ.500 డీజిల్ కోసం ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావించిన వైనం
- ఇది రైతును రక్షించే ప్రభుత్వమా, భక్షించే ప్రభుత్వమా అని ప్రశ్న
- మోదీకి తొత్తుగా ఉంటూ చంద్రబాబు బీజేపీ భజన చేస్తున్నారని విమర్శ
- వదంతులు నమ్మొద్దని చెప్పడం కాదు.. కళ్లు తెరవాలని చంద్రబాబుకు హితవు




**అమరావతి, ఏప్రిల్ 28 (నినాదం) :**
రాష్ట్రంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడిందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రూ. 500 డీజిల్ కోసం ఓ ఆక్వా రైతు పడిన ఆవేదనను ప్రస్తావిస్తూ, ఇది రైతులను రక్షించే ప్రభుత్వమా లేక భక్షించే ప్రభుత్వమా అని ఘాటుగా ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇది వారి పాలిట శాపంగా పరిణమించిందని ఆమె విమర్శించారు. ఈ మేరకు ఆమె ఓ రైతు ఆక్రోశిస్తున్న ఓ వీడియో పంచుకున్నారు. "కూటమి పాపం.. ఆక్వా రైతన్న పాలిట శాపం. రాష్ట్రంలో ఇంధన సంక్షోభం రొయ్య రైతులకు అంతులేని కష్టం. కంటికి రెప్పలా చూసుకొనే రొయ్య పిల్లలను బ్రతికించేందుకు ఓ పెట్రోల్ బంకు దగ్గర రైతన్న పడిన ఆవేదన వర్ణనాతీతం. రూ. 500 డీజిల్ కోసం ఆ రైతు రోదించిన తీరు చూసి కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి. "అన్నా నాకు ఫ్యాన్ సీట్లు (ఏరేటర్) తిరగాలన్నా .. అప్పుచేసి రొయ్య పిల్ల వేశాను.. ఫ్యాన్ సీట్లు తిరగకపోతే నా రొయ్య పిల్ల చచ్చిపోద్ది అన్న" రైతన్న ఆవేదన వింటుంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? చంద్రబాబు గారి ఛాతిలో ఉన్నది గుండెనా? బండనా? ఇది రైతన్నను రక్షించే ప్రభుత్వమా? భక్షించే ప్రభుత్వమా? ఇదేనా చంద్రబాబు గారి విజినరీ? దీన్నే అంటారా అద్భుతమైన గుడ్ గవర్నెన్స్? రైతులతో కాళ్లు పట్టించుకున్న పాపం ఈ కూటమి ప్రభుత్వానికి తగలకపోదు. ఎక్కడా లేని ఇంధన సంక్షోభం ఏపీలోనే ఎందుకొచ్చింది ? ఎన్డీయే పాలిత రాష్ట్రంలో ఇంధనం కోసం ప్రజల పడిగాపులా? పెట్రోల్ బంకుల దగ్గర మల్లయుద్ధాలా? రేషన్ విధానంలో పెట్రోల్, డీజిల్ పోయడమా? సరిపడేంత ఇంధనం ఉంటే దాదాపు 3 వేల బంకుల్లో నో స్టాక్ బోర్డులు ఇవ్వాల్టికి ఎందుకున్నాయి? ఇదేనా రాష్ట్ర ప్రజలపై కేంద్రానికున్న చిత్తశుద్ధి? ఇందుకేనా పడి పడి మోదీజీకి మద్దతు ఇచ్చేది? బంకుల దగ్గర జనాలు అవస్థలు పడుతుంటే, ప్రత్యక్షంగా అన్నీ రంగాలపై ఇంధన సంక్షోభం తీవ్ర పరిణామాలు చూపిస్తుంటే, ఇంకా బీజేపీ భజన చేయడానికి, మోదీగారి తొత్తుగా ఉండటానికి చంద్రబాబు గారు సిగ్గుపడాలి. రాష్ట్రంపై బీజేపీకి పట్టింపు లేదనడానికి ఇంధన సంక్షోభం ఒక నిదర్శనం. వదంతులు నమ్మొద్దని చెప్పే బదులు... ఇప్పటికైనా కళ్లు తెరవండి చంద్రబాబు గారు" అంటూ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

- అతివేగంతో పాదచారులను ఢీకొన్న కారు
- ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం




**విజయనగరం, ఏప్రిల్ 27(నినాదం ):**
పూసపాటిరేగ మండలం పేరాపురం వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న గుత్తేదారుల మిత్ర బృందం ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగం వల్లే ఈ ప్రమాదం జరిగింది. రాత్రి 12 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన కారు.. పేరాపురం వద్ద దుకాణంలో టీ తాగి రోడ్డుపై ఉన్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టింది. అనంతరం వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో ఆగి ఉన్న లారీ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు.. పాదచారులిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారు చోదకుడితో పాటు తీవ్రంగా గాయపడిన మరొకరిని విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బొబ్బిలి వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో విశాఖకు చెందిన ఇరిగేషన్ కాంట్రాక్టరు శ్రీనివాస్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో అమరావతికి చెందిన ఓ న్యాయమూర్తి బంధువులు ఉన్నారని తెలిసింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై దుర్గాప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
04
డిజిటల్ ఎడిషన్
మంగళవారం ఏప్రిల్ 28 2026
ninadam.in

# ఒకటో తేదీన జీతాలు రావడం లేదు

- ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల స్పష్టీకరణ



**మహబూబాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
కాంగ్రెస్ ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్ పేర్కొన్నారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీలు 'అయ్యో సార్ మాకు ఒకటో తేదీన జీతాలు రావడంలేదు' అని ముక్తకంఠంతో ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుతగిలారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. రామచంద్రునాయక్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కలుగజేసుకొని 'సార్ మాకు మాత్రం జీతాలు రావడం లేదు' అని ప్రసంగానికి అడ్డుతగిలారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో జీతాలు పెంచాలనే అంశం ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పగా.. 'సార్ మాకు పోయిన నెల జీతం రూ.13,650 ఇప్పటి వరకు రాలేదు' అని అంగన్‌వాడీలు గుసగుసలాడారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

# ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ


- 14మంది మహిళల దుర్మరణం



**జకార్తాన్యూఢిల్లీ , ఏప్రిల్ 27(నినాదం ):**
ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు ప్రక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

# బాలల భద్రత, డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి బాలల ప్రణాళిక లో భాగంగా ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ రహిత సమాజం కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఈ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సోమవారము వీడియో కాన్ఫరెన్సు హాలునందు జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో బాలల భద్రత మరియు డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత మరియు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా బాలల భద్రత, రక్షణ మరియు డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, యువత మరియు తల్లిదండ్రులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించాలని ఆదేశించారు. మాదకద్రవ్యా లకు యువత దూరంగా ఉండేలా ప్రోత్సహించడం మరియు డ్రగ్స్ అమ్మకాలను అరికట్టేందుకు ప్రభుత్వ చర్యలపై అవగాహన కల్పించడం,బాలల భద్రత పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు బాల్య వివాహాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, బాలల రక్షణ కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన షీ టీమ్స్ మరియు ఇతర రక్షణ వ్యవస్థల ప్రాముఖ్యతను తెలియ జేయాలని అన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లాలోని ప్రతి గ్రామం, విద్యాసంస్థల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు స్థానిక పోలీస్ యంత్రాంగం భాగస్వాములు కానున్నారని తెలిపారు. ఈ సమావేశం లో అడిషనల్ ఎస్ పి రాము నాయక్, ట్రిని కలెక్టర్, సి పి ఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు అరెస్ట్..

- తుర్కియే నుంచి భారత్‌కు అప్పగించిన అధికారులు
- అంతర్జాతీయ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నడుపుతున్నట్టు ఆరోపణలు
- గతంలో రెండుసార్లు అరెస్ట్ అయినా తప్పించుకున్న డోలా
- ప్రస్తుతం ఢిల్లీలో ఎన్‌సీబీ అదుపులో ఉన్న నిందితుడు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(నినాదం ):**
అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం నెట్‌వర్క్‌కు భారత దర్యాప్తు ఏజెన్సీలు భారీ షాక్ ఇచ్చాయి. దావూద్ కీలక అనుచరుడు, నిషేధిత డ్రగ్స్ తయారీలో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సలీం డోలాను భారత్‌కు అప్పగించారు. తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో ఆ దేశ జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థ, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో డోలాను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని భారత్‌కు తరలించారు. ప్రస్తుతం డోలాను ఢిల్లీలోని ఆర్‌కే పురంలో ఉన్న నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) కార్యాలయంలో ఉంచారు. విచారణ అనంతరం అతడిని ముంబై పోలీసులకు అప్పగించనున్నారు. దాదాపు పదేళ్ల క్రితం భారత్ నుంచి పారిపోయిన సలీం డోలా, విదేశాల్లో ఉంటూనే పలు రాష్ట్రాల్లో విస్తరించిన డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నడిపినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఫైసల్ జావేద్ షేక్, అల్ఫియా ఫైసల్ షేక్ అనే వ్యక్తులు డోలా నుంచి మెఫిడ్రోన్ (ఎండీ) డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని సాంగ్లీ, గుజరాత్‌లోని సూరత్ నుంచి యూఏఈ, తుర్కియే వరకు విస్తరించిన ఈ డ్రగ్స్ సరఫరాను డోలా తన అనుచరుల ద్వారా పర్యవేక్షించేవాడని గుర్తించారు. గతేడాది ఇంటర్‌పోల్ సహాయంతో డోలా కుమారుడు తాహెర్, మేనల్లుడు ముస్తఫా మహ్మద్ కుబ్బావాలాను యూఏఈ నుంచి భారత్‌కు రప్పించడంతో అతని నెట్‌వర్క్ బలహీనపడింది.

### ఎవరీ సలీం డోలా?

1966లో ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో సలీం డోలా జన్మించాడు. చిన్న వయసులోనే అండర్‌వరల్డ్ వైపు ఆకర్షితుడై, దావూద్ ఇబ్రహీంకు చెందిన డీ-కంపెనీలో సభ్యుడైన ఛోటా షకీల్‌తో స్నేహం పెంచుకున్నాడు. మొదట్లో ముంబై, ఢిల్లీ నగరాల్లో గుట్కా స్మగ్లింగ్ చేసేవాడు. క్రమంగా డ్రగ్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టి గంజాయి రవాణా ప్రారంభించాడు. 2012లో 80 కిలోల గంజాయితో ఎన్‌సీబీ అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. అయితే, దాదాపు ఐదేళ్లు జైలు జీవితం గడిపిన తర్వాత కోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించింది. జైలు నుంచి విడుదలయ్యాక పరారీలో ఉన్న డ్రగ్స్ సరఫరాదారు కైలాష్ రాజ్‌పుత్‌తో చేతులు కలిపి సింథటిక్ డ్రగ్స్ ప్రపంచంలోకి ప్రవేశించాడు. ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన ఒపియాయిడ్స్‌తో బటన్ అనే సింథటిక్ డ్రగ్‌ను మాత్రల రూపంలో తయారుచేసి విక్రయించడం మొదలుపెట్టాడు. 2018లో ముంబై యాంటీ నార్కోటిక్స్ సెల్ అధికారులు శాంతాక్రూజ్‌లో 100 కిలోల ఫెంటానిల్‌తో డోలాను అరెస్ట్ చేశారు. కానీ, ఫోరెన్సిక్ నివేదికలో శాంపిల్స్ నెగెటివ్‌గా రావడంతో కేవలం నాలుగు నెలల్లోనే బెయిల్ పొందాడు. బెయిల్ రాగానే భారత్ విడిచి యూఏఈకి పారిపోయాడు. అక్కడ తన కొడుకు తాహిర్ పేరు మీద రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించి, డ్రగ్స్ ద్వారా సంపాదించిన డబ్బును అందులో పెట్టుబడిగా పెట్టినట్టు అధికారులు గుర్తించారు.

# పంజాబ్‌లో రైల్వే ట్రాక్‌పై పేలుడు, సమీపంలో మృతదేహం!

- పటియాలాలో రైల్వే ట్రాక్‌పై తక్కువ తీవ్రతతో పేలుడు
- ఘటనా స్థలం సమీపంలో ఛిద్రమైన స్థితిలో మృతదేహం
- విద్రోహ చర్యల కోణంలో పలు ఏజెన్సీలతో దర్యాప్తు
- శాంతిభద్రతలు విఫలమయ్యాయన్న శిరోమణి అకాలీదళ్



**పటియాలా , ఏప్రిల్ 27(నినాదం ):**
పంజాబ్‌లో సోమవారం రాత్రి ఓ రైల్వే ట్రాక్‌పై తక్కువ తీవ్రతతో కూడిన పేలుడు కలకలం రేపింది. ఈ ఘటనలో రైలు పట్టాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పేలుడు జరిగిన ప్రదేశానికి సమీపంలో ఛిద్రమైన స్థితిలో ఓ మృతదేహాన్ని గుర్తించడంతో అధికారులు పలు ఏజెన్సీలతో దర్యాప్తును ముమ్మరం చేశారు. పటియాలాలోని శంభు-అంబాలా మార్గంలో రాత్రి 10 గంటల సమయంలో ఈ పేలుడు జరిగింది. ఈ మార్గంలో ఎక్కువగా గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. సమాచారం అందిన వెంటనే పటియాలా ఎస్ఎస్‌పీ వరుణ్ శర్మ, ప్రభుత్వ రైల్వే పోలీస్ (GRP), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (RPF) బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టాయి. "తక్కువ తీవ్రతతో పేలుడు జరిగింది. దీనివల్ల ట్రాక్‌కు నష్టం వాటిల్లింది" అని ఎస్ఎస్‌పీ వరుణ్ శర్మ మీడియాకు వెల్లడించారు. నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలానికి సమీపంలో లభ్యమైన గుర్తుతెలియని మృతదేహంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ మరణానికి, పేలుడుకు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఎస్‌పీ వివరించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలం నుంచి నమూనాలు సేకరించి, పేలుడుకు గల కారణాలను విశ్లేషిస్తున్నారు. విద్రోహ చర్యల కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై శిరోమణి అకాలీదళ్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. పార్టీ సీనియర్ నేత బిక్రమ్ సింగ్ మజిథియా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, వరుసగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ ఏడాది జనవరిలో ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోనూ ఇదే తరహా పేలుడు జరిగి లోకో పైలట్ గాయపడిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి

- బిఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఆర్ నరసింహ



**వికారాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
రాష్ట్ర ప్రభుత్వం రూ.8,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి అని డిమాండ్ చేస్తూ, బి.ఆర్.ఎస్.వి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం బి ఆర్ ఎస్ వి ఫీజు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వకపోవడంతో, పై చదువులు ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం, మరోవైపు 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఎన్నికల ముందు గ్రీన్ ఛానల్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీని అమలు చేయకపోవడం విద్యార్థుల పట్ల చేసిన ఘోర అన్యాయం చేస్తోందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతూ, ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అన్నారు. రాబోయే 2026,27 విద్యా సంవత్సరంలో ఫీజుల భారం నేరుగా విద్యార్థులపై పడే ప్రమాదం నెలకొందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం వెంటనే స్పందించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

# డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్

- నేడు జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్



**హైదరాబాద్, ఏప్రిల్ 27(నినాదం ):**
మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు పోలీసులు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరఫున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి రోహిత్ రెడ్డి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు.. కొకైన్, లిక్కర్ బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి.. ఒక నెలకు పైగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఎపికి చెందిన ఓ ఎంపి కూడా దొరికినా స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చారు.

# మిషన్ భగీరథ కార్మికులకు వేతన బకాయిలు

- ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపణ

**మెదక్, ఏప్రిల్ 27(నినాదం ):**
మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపిచేడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని.. ఇచ్చే వేతనం కూడా 6 నెలలుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల పనిగంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 4 కొత్త లేబర్ చట్టాల అమలు కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మికచట్టాలను తొలగించడం సిగ్గు చేటు అని విమర్శించారు.

దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమవుతున్న సమయంలో (2019, 2020)లో నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకురావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని.. నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# ఓపక్క కాల్పులు.. మరోపక్క దిగ్బంధనం..

## సురక్షితంగా ముంబైకి చేరిన భారత ఆయిల్, గ్యాస్ ట్యాంకర్లు

- హర్మూజ్ జలసంధిలో అమెరికా దిగ్బంధాన్ని ఛేదిస్తున్న నౌకలు
- ఇరాన్ కాల్పుల మధ్య ముంబైకి చేరిన భారత నౌక 'దేశ్ గరిమ'
- దిగ్బంధనాన్ని తప్పించుకోవడానికి రెండు మార్గాలపై విస్తృత చర్చ
- పాక్ జలాల్లోకి వెళ్లకుండా నేరుగా నౌకలకు ఎస్కార్ట్ ఇస్తున్న భారత నౌకాదళం

**ముంబై , ఏప్రిల్ 27(నినాదం ):**
హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌ను కట్టడి చేసేందుకు అమెరికా విధించిన నౌకా దిగ్బంధనం పూర్తిగా ఫలించడం లేదు. అమెరికా నౌకాదళ నిఘా ఉన్నప్పటికీ డజన్ల కొద్దీ ఆయిల్ ట్యాంకర్లు ఈ మార్గం గుండా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయి. ఇటీవల ఇరాన్ నుంచి వస్తున్న 'దేశ్ గరిమ' అనే భారత నౌక మార్గమధ్యంలో కాల్పులకు గురైనా సురక్షితంగా ముంబై తీరానికి చేరుకుంది. ఈ నౌక ఖతార్‌లోని రాస్ లఫాన్ నుంచి 97,000 టన్నుల ముడి చమురును తీసుకువచ్చింది.
ఏప్రిల్ 13న అమెరికా దిగ్బంధనం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 30కి పైగా ట్యాంకర్లు హర్మూజ్ జలసంధిని దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్‌తో సంబంధం ఉన్న 34 ట్యాంకర్లు అమెరికా దిగ్బంధనాన్ని తప్పించుకున్నాయని 'ది ఫైనాన్షియల్ టైమ్స్' ఇటీవల ఒక కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.



### నౌకలు అనుసరిస్తున్న మార్గాలు ఏవి?

దిగ్బంధనాన్ని తప్పించుకోవడానికి నౌకలు రెండు ప్రధాన మార్గాలను అనుసరించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటిది, ఇరాన్ తీరం వెంబడి ప్రయాణించి, పాకిస్థాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించి, ఆ తర్వాత అంతర్జాతీయ జలాల ద్వారా అరేబియా సముద్రంలోకి రావడం. రెండోది, ఇరాన్‌లోని చాబహర్ ఓడరేవు వరకు తీరం వెంబడి ప్రయాణించి, అక్కడి నుంచి నేరుగా అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించి భారత్ వైపు రావడం. అంతర్జాతీయ సముద్ర చట్టాల (ఖచీజూూూ) ప్రకారం, ఒక దేశ ప్రాదేశిక జలాల్లోకి మరో దేశ నౌకాదళం అనుమతి లేకుండా ప్రవేశించలేదు. ఇదే ఇరాన్ నౌకలకు కలిసొస్తున్న అంశం.



### భారత నౌకాదళం పాత్ర

అయితే, భారత నౌకలు పాకిస్థాన్ జలాలను ఉపయోగించడం అసంభవమని, అనవసరమైన రిస్క్ అని భారత నౌకాదళానికి చెందిన ఒక రిటైర్డ్ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. అమెరికా దిగ్బంధం ఇరాన్ ఓడరేవుల నుంచి వచ్చే నౌకలను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, భారత నౌకల వంటి తటస్థ నౌకలకు ప్రత్యక్ష ముప్పు పరిమితంగానే ఉంటుందని ఆయన తెలిపారు. భారత విదేశాంగ శాఖ దౌత్యపరమైన చర్చల ద్వారా నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేస్తుందని, ఆ తర్వాత భారత నౌకాదళం గల్ఫ్ ఆఫ్ ఒమాన్‌లో ఆ నౌకలను కలుసుకుని సురక్షితంగా భారత తీరాలకు ఎస్కార్ట్ చేస్తుందని వివరించారు. ఈ పద్ధతిలో పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, అమెరికా నౌకాదళ శక్తికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయని, ప్రాదేశిక జలాలను ఉపయోగించుకుని ఇరాన్ నుంచి ముంబైకి చమురు రవాణా సాధ్యమవుతోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.